సాక్షి ప్రకాశం
శనివారం । 7 । జూన్ । 2025



త్యాగానికి ప్రతీక..బక్రీద్
ముస్లింల పండుగల్లో అత్యంత ముఖ్యమైన బక్రీద్ పండుగను శనివారం జరుపుకోనున్నారు.
- 10లో..



మూల్యాంకనంలో తప్పులు లోకేష్ పుణ్యమే
పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలో తప్పులకు మంత్రి లోకేష్‌దే బాధ్యత అని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు అన్నారు.
- 10లో..

గరిష్ఠం/కనిష్ఠం
40 /29

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే బూచేపల్లి బక్రీద్ శుభాకాంక్షలు



డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ

దర్శి (కురిచేడు): జిల్లాలోని ముస్లింలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. హజ్రత్ ఇబ్రహీం జీవితాంతం చేసిన త్యాగాలకు ప్రతీక గా ముస్లింలు బక్రీద్ పండుగ చేస్తారని అన్నారు. పేదలకు దాన ధర్మాలు చేసే బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నిర్దిష్ట వ్యవధిలో పరిశ్రమలకు అనుమతులు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్: పరిశ్రమల స్థాపనకు నిర్దిష్ట వ్యవధిలోనే అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశం భవనంలో ప్రత్యేక జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పరిశ్రమల అనుమతులు కోసం వివిధ శాఖలకు చెందిన 137 దరఖాస్తుల్లో 110 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా నిర్దిష్ట గడువులోగా పరిశీలించి అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలకు 449 క్లెయిమ్‌లకు గాను రూ.7.22 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, ఏపీ సీపీడీసీఎల్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, నాబార్డు ఏజీఎం రవి కుమార్, ఏపీపీసీబీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తూ పండుగ చేసుకోవాలి



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ చినోబులేసు

ఒంగోలు టౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు కోరారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల గురించి సమీక్షించి తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధ చట్టం-1977ను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. జంతువుల అక్రమ రవాణా, జంతు వధ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా జంతువధ శాలల వద్ద ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. స్లాటర్ హౌస్‌ల వద్ద పారిశుధ్య చర్యలు తీసుకోవాలని, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, అలాగే ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

వీరయ్య చౌదరి హత్య కేసులో ఇద్దరు అరెస్టు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో శుక్రవారం మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం చల్లాయ పాలెం గ్రామానికి చెందిన గోళ్ల రుత్యేంద్ర బాబు అలియాస్ నాని, నెల్లూరు జిల్లాకు చెందిన ఓబిలి నాగరాజును త్రోవగుంట వద్ద అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. నిందితులకు రిమాండ్ విధించారు. నాని మీద రౌడీషీట్ తో పాటు రెండు హత్యకేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కన్నీటి రహదారి!



కనిగిరి ఎన్‌హెచ్ 565 బైపాస్ రోడ్డు

జాతీయ రహదారి వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశ పడ్డారు. అధికారుల హామీలు నమ్మి భూములు ఇచ్చారు. జాతీయ రహదారి 565 నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. భూములిచ్చిన రైతులకు మాత్రం పరిహారం అందక అవస్థలు పడుతున్నారు. భూసేకరణ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వీరి పాలిట శాపంగా మారింది. పరిహారం కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం మాత్రం శూన్యం. బడా బాబులకు పరిహారం ఇచ్చేసిన అధికారులు చిన్న, సన్నకారు రైతులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాంకేతిక సాకులు చూపుతూ ఇప్పటికీ మూడు సార్లు ఫైలు వెనక్కి వచ్చింది.

- ఎన్‌హెచ్ 565 నిర్మాణానికి 19 ఎకరాల భూసేకరణ
- భూములిచ్చిన రైతులు, ప్రజలు
- పరిహారం కోసం నగంమందికిపైగా బాధితుల ఎదురు చూపులు
- సాంకేతిక సాకులు చూపుతూ ముచ్చటగా మూడోసారి ఫైలు వెనక్కి
- కనిగిరి సమీపంలో పూర్తి కావస్తున్న బైపాస్ పనులు
- శాపంగా మారిన భూసేకరణ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- రూ.4 కోట్ల బకాయిలు పెండింగ్
- ఆందోళనకు సిద్ధమవుతున్న బాధితులు

కనిగిరిరూరల్: తెలంగాణ రాష్ట్రం నకిరేకల్ నుంచి నల్గొండ, రాష్ట్రంలోని మాచర్ల, మార్కాపురం, చిన్నారికట్ల, పొదిలి, కనిగిరి, పామూరు, వెంకటగిరి తిరుపతి జిల్లా ఏర్పేడు వద్ద జాతీయ రహదారిని కలుస్తుంది ఈ ఎన్‌హెచ్ 565 రహదారి. తిరుపతికి, చెన్నై నగరానికి వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఇన్ని ప్రాంతాలను కలిపే జాతీయ రహదారి కోసం రైతులు విలువైన భూములను ఇచ్చారు. దాదాపు మూడున్నర కిలోమీటర్లు బైపాస్‌ను నిర్మాణానికి అధికారులు చకచకా భూ సేకరణ చేశారు. పనులు కూడా పూర్తి కావస్తున్నాయి. ఇక్కడ వరకూ అంతా బాగానే ఉన్నా పరిహారం విషయంలో భూములిచ్చిన వారు మాత్రం అవస్థలు పడుతూనే ఉన్నారు. భూములిచ్చిన వారిలో బడాబాబులకు మాత్రం వెంటనే పరిహారాన్ని అందజేశారు. చిన్న సన్నకారులు రైతులు నిత్యం అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రెండు శాఖల అధికారుల నిర్లక్ష్యమే వీరిపాలిట శాపంగా మారింది. న్యాయం చేయాల్సిన రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులే చేతులెత్తేస్తుండటంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

2014లో ప్రారంభమైన పనులు..

ఎన్‌హెచ్ 565 రోడ్డు పనులు 2014లో కనిగిరిలో ప్రారంభమయ్యాయి. కనిగిరి పట్టణంలోని కనిగిరి-కంభం క్రాస్ రోడ్డు, చెక్‌పోస్టు సమీపం నుంచి కనిగిరి- పామూరు రోడ్డు.. కొత్తూరు గుడి వరకు ఎన్‌హెచ్ 565 హైవే బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనికి సంబంధించి పట్టణ సమీపంలోని సుమారు 19 ఎకరాల భూమిని 20 నుంచి 25 సర్వే నంబర్లలో సేకరించారు. బడా, చిన్న, సన్నకారు రైతులు 100 మంది వరకు భూములు కోల్పోయారు. వీరు కాక మరో 30 నుంచి 40 మంది వరకు ప్లాట్లు కోల్పోయిన వారున్నారు. దాదాపు 140 మంది వరకూ భూములు ఇచ్చిన వారు ఉన్నారు. నష్ట పరిహారం కింద రూ.14 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఇందులో బడాబాబులకు మాత్రం రూ.10 కోట్ల వరకు చెల్లించినట్లు సమాచారం. మరో రూ.4 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. వీరందరికీ గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలలో రెండు విడతలుగా పరిహారం నగదు బాధితులకు జమ చేశారు. ఇంకా సుమారు 39 మంది సెంట్లల్లో భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం రావాల్సి ఉంది. వారు కాకుండా ప్లాట్ల కోల్పోయిన సుమారు 30 మంది బాధితుల పేర్ల ఇంకా అసలు పరిహార జాబితాలోనే నమోదు కాలేదు. సర్వే నంబర్ 659, 709/3 లలో భూములు, ప్లాట్లు కోల్పోయిన వారికి ఒక్క రూపాయి కూడా పరిహారం అందలేదని బాధితులు తెలిపారు. అనేక మంది భూ బాధితులు రోడ్డు నిర్మాణం పూర్తయితే తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు.



ఎన్‌హెచ్ 565 హైవే

పరిహారం ఫైళ్లు వెనక్కి..

భూములిచ్చిన రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో భూసేకరణ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లోపించిందన్న ఆరోపణలు ఉన్నాయి. 39 మంది బాధితులకు సంబంధించి పరిహారం కోసం పంపుతున్న ఫైలు ఇప్పటికీ మూడు సార్లు వెనక్కి వచ్చేసింది. తప్పు ఏ శాఖదైనా.. నిర్లక్ష్యం ఏ అధికారులదైనా భూములిచ్చిన వారు మాత్రం అవస్థలు పడుతూనే ఉన్నారు. ఇప్పటికీ మూడు సార్లు ఫైలు వెనక్కి వచ్చిందంటే తప్పు ఎవరిదో అంటూ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఫైనాన్షియల్ ఇన్‌వాలిడ్ పేరుతో జాతీయ రహదారుల అథారిటీ ఉన్నతాధికారులు ఫైలును తిప్పి పంపారు. మార్చిలో మళ్లీ పంపగా తిరస్కరణకు గురైంది. తాజాగా మరో తప్పుతో పరిహార ఫైలు తిరస్కరించినట్లు శుక్రవారం జిల్లా అధికారులకు సమాచారం వచ్చినట్లు తెలిసింది. పరిహారం ఇచ్చే విషయంలో అధికారులు ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడంలేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

పూర్తికావస్తున్న పనులు:

కనిగిరిలో ఎన్‌హెచ్ 565 రోడ్డు పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. రోడ్డు పూర్తయితే తమను ఎవరు పట్టించుకుంటారని బాధిత రైతులు గగ్గోలు పెడుతున్నారు. పరిహార జాబితా రీ ఫైనలైజేషన్ ఎప్పటికి జరుగుతుంది.. తమకు ఎప్పటికి పరిహారం దక్కుతుందని బాధితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బాధితుల పరిహార విషయం పై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి న్యాయం చేయాల్సిన జిల్లా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం.. అసలు తరచూ ఫైల్ ఎందుకు రిజక్ట్ చేస్తున్నారనే దానిపై దృష్టి పెట్టకపోవడంపై పలు విమర్శలకు దారితీస్తోంది.

భూమి రాసి పోర్టల్ నుంచి రిటర్న్..

కనిగిరి ఎన్‌హెచ్ 565 బైపాస్ భూ బాధితుల పరిహారానికి సంబంధించిన ఫైల్ గతంలో ఒక సారి సాంకేతిక లోపంతో రిటన్ వచ్చింది. మళ్లీ రీఫైనలైజేషన్ చేసి పెట్టాం. మళ్లీ ఇప్పుడు రిటన్ వచ్చింది. ఇలా ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదు. మా వైపు నుంచి మేము ఫైల్‌ను పరిశీలించే పంపుతున్నాం. పై నుంచి 'భూమి రాసి పోర్టల్' నుంచి రిటర్న్ వస్తోంది. దీనిపై సోమవారం మళ్లీ విజయవాడ టెక్నికల్ అధికారులతో మాట్లాడుతాం.

– గోపాలకృష్ణ, జాయింట్ కలెక్టర్

నాటి మాటలు హామీలు ఏమయ్యాయి..?

ఎన్‌హెచ్ 565 రోడ్డు నిర్మాణ సమయంలో భూ బాధితులందరికీ న్యాయం చేస్తాం.. అభివృద్ధిని ఎవరూ అడ్డుకోవద్దు..దశల వారీగా నష్టపోయిన భూ బాధితునికి ప్రతి సెంటుకు పరిహారం ఇప్పిస్తామని పలు మార్లు సభలు, సమావేశాలు పెట్టి కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నత స్థాయి అధికారులు నమ్మబలికారు. రోడ్డు పనులు అడ్డు లేకుండా సాఫీగా జరుగుతున్నాయి. అయితే డివిజన్, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు మాత్రం సన్న, చిన్న కారు రైతులకు పరిహారం అందించే విషయాన్ని విస్మరించారు. నష్ట పరిహార ఫైల్ మూవింగ్ విషయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సెంటు నుంచి ఐదు సెంట్ల భూములు, ప్లాట్లు కోల్పోయిన 39 మంది భూ బాధితులు కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ పరిహారం కోసం ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. సుమారు రూ.3 కోట్లు బాధితులకు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. తమకు రావాల్సిన పరిహారం పై ఆందోళన చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు.

రోజు రోజుకూ పొగాకు ధరలు దిగజారుతున్నాయి

● ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు



త్రోవగుంట పొగాకు వేలం కేంద్రంలో పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: పొగాకు వేలాన్ని పరిశీలిస్తే రోజు రోజుకీ ధరలు దిగజారుతున్నాయని ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవి బాబు అన్నారు. త్రోవగుంటలోని పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం చుండూరి రవిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోగ్రేడ్‌ను రూ.180 లకు కొనేటప్పుడు బేళ్ల వెనక్కు వెళుతున్నాయనీ, రూ.240 పెట్టి కొనేటప్పుడు కూడా వెనక్కి పంపిస్తున్నారన్నారు. కూలీ రైతులు, కౌలు రైతులు, నోరులేని రైతులు అయ్యేసరికి కంపెనీలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. వాస్తవానికి ఆర్డర్లు వచ్చాయి కాబట్టే పొగాకును కొనుగోలు చేస్తున్నారనీ, ఆర్డర్లు రాలేదని చెప్పడం అవాస్తమన్నారు. మే నెల మొదటి వారంలోనే ఆర్డర్లు వచ్చాయనీ, ఇప్పటికీ ఆర్డర్లు రాలేదని చెప్పడం అబద్ధమన్నారు. గత సంవత్సరం పొగాకు ధరలు బాగా ఉన్నాయని, ఈ సంవత్సరం వ్యాపారులు సిండికేట్ అయి తక్కువ ధరకు కొనాలని చూస్తున్నారని విమర్శించారు. బోర్డు అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. బోర్డు అధికారులే రైతులకు ఇంకా ధర తగ్గిపోతుందని అని చెప్పడం దారుణమన్నారు. రైతులను చైతన్య పరిచాల్సిన వారే ఇంకా రేటు తగ్గుతుందని చెబుతూ వారి కమీషన్ వారు తీసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. మీరు ఒత్తిడి చేయండి కంపెనీలు భయపడతాయి అని చెప్పాల్సిన వారే కంపెనీ తరపున వకాల్తా పుచ్చుకుని అమ్ముకోండి ఇంకా రేట్లు తగ్గుతాయని రైతుల ఆశలను నీరుగారుస్తున్నారని ఆరోపించారు. వారికి వచ్చే కమీషన్ కోసం ఒత్తిడి పెడుతూ మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఫ్లోర్‌లలో ఉండే రైతు నాయకులు, వారి అనుయాయుల బేళ్లు కంపెనీలకు చెప్పి అమ్మించుకుంటూ నోరు లేని రైతులకు సహాయం చేయకుండా వారికి అండగా నిలబడకుండా ఉంటున్నారని విమర్శించారు. రైతుల్లో చైతన్యం రావాలని పిలుపునిచ్చారు. రైతులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందన్నారు. రైతుల కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా మద్దతు ధరతో కొనిపిస్తేనే రైతులు నష్టాల నుంచి బయటపడతారని, లేకపోతే ఆత్మహత్యల పాలవుతారన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో మన జిల్లాలో నష్టపోయి ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. అటువంటి పరిస్థితి రాకుండా ఉండటం కోసం రైతాంగం ఓర్పుగా పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. చుండూరి వెంట ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రశాంతంగా డీఎస్సీ



క్విస్ పరీక్ష కేంద్రంలో రూం నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



చిన్నారితో పరీక్షకు వచ్చిన అభ్యర్థులు

● కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయ పోస్టుల కోసం నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 629 పోస్టుల భర్తీకి నిర్వహించే ఈ పరీక్షలకు 24,659 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 30వ తేదీ వరకూ ప్రతి రోజు రెండు షిఫ్ట్‌ల్లో పరీక్షలు జరుగుతాయి. ఒంగోలు నగరంతోపాటు మార్కాపురం పట్టణంలో మొత్తం ఎనిమిది కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. తొలి రోజు 5 కేంద్రాల్లో 791 మంది హాజరు కావాల్సి ఉండగా 718 మంది హాజరయ్యారు. 81 మంది గైర్హాజరయ్యారు. ఒంగోలులోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో 170 మందికి గాను 147 మంది, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో 200 మందికి 179 మంది, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో 201 మందికి గాను 189 మంది, మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇంజినీరింగ్ కాలేజీలో 120 మందికి గాను 106 మంది, కృష్ణచైతన్య ఇంజినీరింగ్ కాలేజీలో 100 మందికి గాను 89 మంది హాజరయ్యారు.

మెగా డీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలులో మెగా డీఎస్సీ పరీక్ష జరుగుతున్న బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా అన్నీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 8 కేంద్రాల్లో మెగా డీఎస్సీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్ష జరుగుతుందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారన్నారు. కలెక్టర్ వెంట అర్బన్ తహసీల్దార్ మధుసూదన్ రావు, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.



చివరి నిముషంలో పరీక్షకు సిద్ధమవుతూ..



పరీక్ష కేంద్రం వద్ద బారులుతీరిన డీఎస్సీ అభ్యర్థులు





నిర్మానుష్యంగా ఉన్న ఒంగోలు చర్చి సెంటర్

ఎండ ప్రచండం

- జిల్లాలో నానాటికీ తీవ్రమవుతున్న ఎండలు
- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఉదయం నుంచే భానుడి ప్రతాపం మరూ



ఎండకు గొడుగు నీడ..

ఒంగోలు టౌన్: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. మూడు రోజుల నుంచి ఉదయం నుంచే ఎండ ప్రభావం చూపిస్తోంది. నడినెత్తిన సూర్యుడు భగభగమంటుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. రోహిణీ కార్తెలో రోళ్ల పగులుతాయని పెద్దలు చెప్పిన మాట వాస్తవమన్నట్లుగా నిప్పుల కుంపటిలా ఎండ వేడి వేధిస్తోంది. మే 27 నాటికి రుతుపవనాలు వచ్చేస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. చెప్పినట్లే మూడు రోజుల పాటు వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దాంతో ఇక ఎండా కాలం ప్రభావం ముగిసినట్లేనని అంతా భావించారు. అందుకు భిన్నంగా మళ్లీ ఎండలు మండిపోవడం మొదలైంది. ఒక్కసారిగా 40 డిగ్రీలకు చేరుకుంది. మారిన వాతావరణంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. దానికి తోడు గాలి స్తంభించడంతో ఉక్కపోత అల్లాడిస్తోంది. కొద్దిసేపు ఫ్యాను తిరగకపోతే చెమటలతో దేహమంతా తడిసిపోతోంది. ఉదయం 6 గంటల నుంచే ఎండ వేడి మొదలవుతోంది. 10 గంటల కల్లా తీవ్రరూపం దాలుస్తోంది. సాయంత్రం 7 గంటల వరకు ఉక్కపోతతో వేడి గాలులు వీస్తున్నాయి. బుధవారం నాటికి జిల్లా అంతటా 39 డిగ్రీల ఎండ కాయగా శుక్రవారం 40 డిగ్రీ గరిష్ఠ ఉష్ణోగ్రత, 29.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇదే పరిస్థితి మరి కొద్ది రోజులు కొనసాగే అవకాశం ఉందంటున్నారు.



ముఖానికి ఎండ తగలకుండా..

క్లుప్తంగా

కన్యాదానం చేయకముందే.. కన్న తండ్రి కాటికి

మద్దిపాడు: అల్లారుముద్దుగా పెంచుకున్న తన కుమార్తె వివాహం చేసేందుకు ఆ తండ్రి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. రేపు కళ్యాణం అనగా.. కన్యాదానం చేయకముందే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు అతన్ని కబళించింది. ఈ విషాదకర సంఘటన మద్దిపాడు మండలంలోని కూచిపూడి-విజయలక్ష్మీపేట గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని సన్నమూరు గ్రామానికి చెందిన దాసరి బాలయ్య (46) తన కుమార్తె అయిన కళ్యాణికి శనివారం మాలకొండలో వివాహం జరిపించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో కూచిపూడి నుంచి ద్విచక్రవాహనంపై సన్నమూరు గ్రామం బయలుదేరిన బాలయ్యను సరిగ్గా కూచిపూడి సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, తీవ్రగాయాలపాలైన బాలయ్యను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని బంధువులు తెలిపారు.

గంట వ్యవధిలోనే చోరీకి గురైన సొత్తు స్వాధీనం

కనిగిరి రూరల్: మహిళ వద్ద నుంచి అపహరణకు గురైన బంగారు ఆభరణాలను గంట వ్యవధిలోనే రికవరీ చేసి అప్పగించినట్లు కనిగిరి ఎస్సై టీ శ్రీరాం తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం భీమ్రావ్‌నగర్‌లో నివాసం ఉంటున్న చియాద్రి ఆదిలక్ష్మి తన స్వగ్రామం అయిన కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరం వచ్చింది. గురువారం రాత్రి తన పెదనాన్న దశదినకర్మలో ఉండగా, ఆదిలక్ష్మికి చెందిన సుమారు రూ.3 లక్షల విలువ చేసే బంగారు సరుడు, హారం, ఇతర బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. శుక్రవారం ఉదయం తన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించిన ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు తక్షణం విచారణ చేపట్టి గంట వ్యవధిలోనే శంఖవరంకు చెందిన నిందితురాలు సుప్రియను అదుపులోకి తీసుకున్నారు. ఆమె దగ్గర నుంచి బంగారు ఆభరణాలను రికవరీ చేసి ఆదిలక్ష్మికి అప్పగించారు.


కనిగిరిలోని ఈద్గా


ప్రత్యేక నమాజులో ముస్లింలు (ఫైల్)

త్యాగానికి ప్రతీక.. బక్రీద్

- నేడు భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకునేందుకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు
- ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్‌లు
- ముస్తాబైన మసీదులు

కనిగిరి రూరల్/కంభం:

ముస్లింలు జరుపుకునే అత్యంత ముఖ్యమైన పండుగల్లో రంజాన్ తర్వాత బక్రీద్ పండుగ ఒకటి. దీనినే ఈదుల్ అజహా, ఈదుజ్జుహా అని కూడా పిలుస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 12వ నెల జిల్ హిజ్ 10వ తేదీ బక్రీద్ పండుగను ముస్లింలు నిర్వహించుకుంటారు. ఇస్లాంలోని ఐదు ప్రధాన సూత్రాల్లో ఒకటైన హజ్ తీర్థయాత్రను కూడా ముస్లింలు ఈ నెల ప్రారంభంలోనే భక్తిప్రవత్తులతో, నియమ నిష్ఠలతో చేస్తారు. నేడు బక్రీద్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక కథనం..

త్యాగనిరతిని చాటి చెప్పే పండుగ...

ఈదుల్ జుహా అనేది మనిషి త్యాగనిరతిని చాటి చెప్పే పండుగ. ఈ పండుగనే బక్రీద్ అంటారు. బక్రీద్ ఎందుకు జరుపుకుంటారంటే.. హజ్రత్ ఇబ్రహీం (సో.అ.స) వారు నిద్రిస్తున్న సమయంలో ఆయన కలలో అల్లాహ్ కనిపించి, నీకు అత్యంత ప్రాణమైన నీ ఎనిమిదేళ్ల వయస్సు గల కుమారుడిని నాకు (అల్లాహ్ మార్గంలో ఖుర్బానీ) దేవుని పేరిట త్యాగం ఇవ్వమని కోరతారు. నిద్ర నుంచి మేల్కొన్న ఇబ్రహీం (సో.అ.స) తన కుమారుడు ఇస్మాయిల్‌కు ఈ విషయాన్ని తెలియజేస్తారు. దైవ భక్తుడైన ఇస్మాయిల్ తాను దైవానుసారం, దైవాజ్ఞ అమలుపరిచేందుకు సిద్ధంగా ఉన్నానని అంగీకారం తెలుపుతారు. దీంతో అల్లాహ్ ఆదేశానుసారంగా ఇబ్రహీం


కంభంలోని ఈద్గా మైదానం వద్ద ఏర్పాటు చేసిన వజూఖానా


కంభంలో బక్రీద్ ప్రార్థనలకు సిద్ధం చేసిన ఈద్గా మైదానం

(సో.అ.స) తన ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్‌ను ఖుర్బానీ ఇచ్చేందుకు సిద్ధమవుతాడు. కలలో ఆదేశించిన సూచనల మేరకు అడవిలోని ఏకాంత ప్రదేశంలో రాతిపై ఇబ్రహీం (సా) కుమారుడు ఇస్మాయిల్‌ను సమర్పించేందుకు తీసుకెళ్తారు. వెంట తల్వార్ (పదునైనా కత్తి) కూడా తీసుకెళ్తారు. ఈ క్రమంలో బాలుడు (ఇస్మాయిల్) నాన్నా.. నా మీద ఉన్న ప్రేమతో నీవు కత్తిని గొంతుపై కోయలేవు. నా మొహానికి గుడ్డ కట్టి నాపై కత్తి కోయాలని చెప్తాడు. ఆ రీతిలో కుమారుడిని ఖుర్బానీ ఇచ్చేందుకు తల్వార్ (పదునైన కత్తి)తో కుమారుడి గొంతుపై నరుకుతాడు. కానీ ఆ కత్తి తెగలేదు. ఆ సమయంలో అల్లాహ్ (దేవుడు) ఇబ్రహీం త్యాగనిరతిని ప్రశంసిస్తూ.. సంతోషిస్తూ.. ఒక్కసారిగా ఇస్మాయిల్ పడుకోబెట్టిన స్థానంలో ఒక పొట్టేలును ప్రత్యక్షం చేస్తాడు. దీంతో పొట్టేలు జువా అవుతుంది. దీంతో అల్లా దేవదూత అయిన జిబ్రయిల్ (సా) అక్కడికి వచ్చి మీరు అల్లాహ్ పెట్టిన అగ్ని పరీక్షల్లో నెగ్గారని చెప్తారు. దీనికి ప్రతీకగా ముస్లింలు బక్రీద్ పండుగ నిర్వహించుకుంటారు. నాటి నుంచి నేటి వరకు అలాగే ప్రళయదినం రోజు దాకా బక్రీద్ పండుగ రోజు స్థితిమంతులు, ఉన్నతులు, ఆర్థిక స్థోమత ఉన్నవారు పొట్టేలు మాంసాన్ని ఖుర్బాని పేరుతో పేదలకు పంచుతారు.

మూడు భాగాలుగా విభజించి...

బక్రీద్ పండుగ సందర్భంగా ఇచ్చే ఖుర్బానీని మూడు భాగాలుగా విభజిస్తారు. ఒంటె, మేక, పొట్టేలును ఖుర్బానీ ఇస్తారు. ఖుర్బానీ చేసిన తర్వాత దాన్ని మూడు భాగాలుగా విభజిస్తారు. ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు పంచుతారు. ఇంకో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు.

ఈద్గా వద్ద నమాజ్...

రంజాన్ ప్రార్థనల మాదిరిగానే బక్రీద్ పండుగకు కూడా ఈద్గాల వద్ద నమాజ్ చదువుతారు. ధార్మిక ప్రసంగం (ఖుద్బా) తర్వాత ఈద్గా నమాజ్ జరుగుతుంది. బక్రీద్ నమాజ్‌ను ఈద్గా లేదా మసీదులో సామూహిక (జమాత్‌తో) ప్రత్యేక ప్రార్థనలతో నిర్వహిస్తారు.

ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన మసీదులు, ఈద్గాలు...

బక్రీద్ పండుగ సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు నిర్వహించే ప్రార్థనలకు ఈద్గా మైదానాలతో పాటు మసీదులు ముస్తాబయ్యాయి. ప్రార్థనలకు వెళ్లేవారు తమ ఇళ్ల వద్ద నుంచి ర్యాలీగా బయల్దేరి ఈద్గా మైదానాలలో ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈద్గా వద్దకు వెళ్లలేని వృద్ధులు, వికలాంగులు, ఇతరుల కోసం మసీదుల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు ఈద్గాలో నమాజులు ప్రారంభమవుతాయని, ఆలోపు అందరూ అక్కడికి చేరుకోవాలని కమిటీ పెద్దలు తెలిపారు.

కనిగిరిలో రెండు చోట్ల...

కనిగిరిలో రెండు చోట్ల ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ మేరకు సమయాన్ని, ప్రదేశాలను ఇప్పటికే ప్రకటించారు. మసీద్ ఏ అలీ పాత 4వ వార్డు ప్రస్తుత 8వ వార్డులో మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఇంటి సమీపంలోని మసీద్‌లో ఉదయం 7 గంటలకు బక్రీద్ పండుగ ప్రత్యేక బయాన్, 7.30 గంటలకు ప్రత్యేక నమాజ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వృద్ధులు, ఆరోగ్యం బాగా లేని వారు, నడవలేని వారు ఇక్కడ నమాజ్ చదువుకుంటారు. అలాగే, కనిగిరి పెద్ద చెరువు వద్ద గల ప్రత్యేక ప్రార్థనా స్థలంలో (ఈద్గా వద్ద) ఉదయం 9 గంటలకు బయాన్, అనంతరం 9.30 గంటలకు ప్రత్యేక నమాజ్ జరుగుతుందని ముస్లిం పెద్దలు తెలిపారు.

లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

సింగరాయకొండ: ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ఊరేగింపుగా వచ్చి పుట్టమట్టి సేకరించి పూజలు చేశారు. ఆ మట్టిలో నవధాన్యాలు మొలకెత్తే విధంగా చేసి ఆలయ నలుమూల ఏర్పాటు చేయడంతో బ్రహ్మోత్సవాలలో తొలి ప్రధాన ఘట్టం పూర్తయింది. శనివారం మధ్యాహ్నం ధ్వజారోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టం పూర్తవుతుందని, స్వామివారి గరుడప్రసాదం భక్తులకు పంచిపెడతామని, దీని కోసం రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు వస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కృష్ణవేణి వివరించారు.

పొగాకు రైతులను విస్మరించిన కూటమి

- పంట కొనుగోలు చేస్తామని మాటలతో సరిపెట్టారు
- కల్లబొల్లి కబుర్లతో రైతులను సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారు
- ఇప్పటికైనా మద్దతు ధరకు పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

యర్రంవారిపాలెం (కారంచేడు): ఈ ఏడాది పొగాకు సాగుచేసిన రైతన్నలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం బాపట్ల జిల్లా కారంచేడు మండలంలోని యర్రంవారిపాలెంలో స్థానిక పొగాకు రైతులు ఆయనను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం విలేకర్లతో బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలతో పాటు సంతనూతలపాడు నియోజకవర్గంలో కొంత మేర బ్లాక్ బర్లీ, దొర పొగాకు సాగుచేశారన్నారు. ప్రస్తుతం పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గిట్టుబాటు ధరలు లేక, కొనే నాథుడు లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలే శరణ్యమన్నట్లుగా జీవిస్తున్నారని తెలిపారు. పొగాకు సాగు చేసిన రైతుల్లో ఎక్కువ శాతం కౌలు రైతులేనన్నారు.

వైఎస్ జగన్ స్టేట్‌మెంట్‌తో మంత్రుల బృందం హడావిడి...

పొగాకు రైతుల పక్షాన పోరాడతానని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో అప్పటికప్పుడు ఆఘమేఘాల మీద మంత్రుల బృందం పర్యటించి హడావిడి చేసిందని బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. పొగాకు కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ మాటలకే పరిమితమైందని తెలిపారు. నెలవుతున్నా ఇంత వరకు పొగాకు రైతుల కన్నీరు తుడవలేకపోయారన్నారు. 89 మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తే.. ఇప్పటికి కేవలం 25 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి పట్టీపట్టనట్లు దోబూచులాడుతున్నారన్నారు. మే 28వ తేదీ పొగాకు రైతులను ఆదుకునేలా పొదిలి రావాల్సిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక వర్షాల వలన రాలేకపోయారన్నారు. నాలుగైదు రోజుల్లో ఆయన వస్తారన్నారు. ఏప్రిల్ 29వ తేదీ లాం ఫాంలో వ్యవసాయ శాఖామంత్రి అచ్చన్నాయుడు 10 రోజుల్లో పొగాకు కొనుగోలు చేయిస్తానని చెప్పారని, ప్రస్తుతం నెల రోజులు దాటినా కొనుగోళ్లలో చలనం కనిపించడం లేదని విమర్శించారు. పొగాకు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడానన్న సీఎం చంద్రబాబు మాటల్లో నిజాయితీ లేదన్నారు. గత సంవత్సరం ప్రముఖ జీపీఐ పొగాకు కంపెనీ 40 నుంచి 50 వేల మిలియన్ కిలోల నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయడమే కాకుండా ఈ సంవత్సరం కూడా తమ ప్రతినిధులతో రైతులను పొగాకు సాగు చేయమని ప్రోత్సహించడం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఐటీసీ కంపెనీ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కొనుగోలు చేస్తామని చెప్పి పోలిశెట్టి సోమసుందరం, తదితర కంపెనీల ప్రతినిధులు ఏమాత్రం ఆసక్తి చూపకపోవడం అన్యాయమన్నారు. వీరంతా కుమ్మక్కై ధరలు రాకుండా తొక్కి పట్టి రైతులను దీవాళా తీయించాలని చూస్తున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న తంతు చూస్తే పొగాకు కంపెనీలన్నీ కొనుగోలు చేసినా 25 శాతం మాత్రమేనని, మిగిలిన పొగాకు పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. రైతులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకు ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించకుండా వెంటనే బర్లీని మొత్తం కొనుగోలు చేయాలని బత్తుల డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో తడిచిన పొగాకును కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.30 వేల నుంచి రూ.36 వేల వరకు ధరలు వెచ్చించి పొగాకు కొనుగోలు చేసిందన్నారు. గత ప్రభుత్వంలో రైతు స్థిరీకరణ నిధి రూ.3 వేల కోట్లను మించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. బత్తుల బ్రహ్మానందరెడ్డి వెంట యర్రం లక్ష్మారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పోలూరి శివారెడ్డి, భవనం రాజగోపాల్‌రెడ్డి, భవనం వెంకటేశ్వరరెడ్డి, మనుబోతు వెంకటరెడ్డి, గుదిబండి అంజిరెడ్డి, పమ్మి వెంకటరెడ్డి, స్థానిక రైతులు ఉన్నారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత


చదలవాడ వద్ద పట్టుకున్న రేషన్ బియ్యం లారీతో అధికారులు


మద్దిపాడులో పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలిస్తున్న ఏఎస్‌ఓ పుల్లయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, సిబ్బంది

నాగులుప్పలపాడు: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు పట్టుకున్నారు. ఆ శాఖ డీటీ రాజ్యలక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. చీరాల వైపు నుంచి ఒంగోలు వైపునకు గురువారం అర్ధరాత్రి లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్న విషయాన్ని పసిగట్టి చదలవాడ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. లారీలో సుమారు 300 బస్తాల వరకు రేషన్ బియ్యం ఉండవచ్చని అంచనా వేశారు. అనంతరం లారీని, డ్రైవరును నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు డీటీ తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌ఐ గుణ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: స్థానిక శ్రీ వెంకటేశ్వర రైస్‌మిల్లులో రేషన్ బియ్యాన్ని గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత అధికారులు పట్టుకున్నారు. రైస్ మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు అజ్ఞాత వ్యక్తుల ద్వారా సమాచారం అందుకున్న ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న ఆదేశాల మేరకు మద్దిపాడు తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎస్‌ఐ శివరామయ్య రైస్‌మిల్లు వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ రేషన్ బియ్యం ఉండటంతో సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా సివిల్ సప్లయిస్ శాఖకు బియ్యం అప్పగించారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకూ రైస్‌మిల్లులో ఉన్న బియ్యాన్ని లోడ్ చేయించి చూడగా, 2108 బస్తాల బియ్యం పట్టుబడినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.40,05,200 ఉంటుందన్నారు. పట్టుబడిన బియ్యాన్ని గోడౌన్‌కు తరలిస్తున్నట్లు ఏఎస్‌ఓ పుల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఐ వంశీ, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్లను పరిశీలించిన మార్క్‌ఫెడ్ డీఎం

నాగులుప్పలపాడు: రైతుల వద్ద బర్లీ పొగాకును రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు స్టాక్ పాయింట్లను మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని ఉప్పుగుండూరు మార్కెట్ యార్డు గూడేంను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ఎన్నిచెక్కులు, ఎన్ని లారీలు నిల్వ చేయవచ్చనే వివరాలు సేకరించారు. సుమారు 20 లారీల సరుకు పట్టవచ్చని అంచనా వేశారు. ఉప్పుగుండూరు మార్కెట్ యార్డులోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పొగాకు రైతులు కోరారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్లను పరిశీలిస్తున్నామని, కొనుగోలు కేంద్రాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డీఎం తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.వెంకట్రావు, రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మూల్యాంకనంలో తప్పులు లోకేష్ పుణ్యమే

- ప్రభుత్వ తప్పిదాన్ని ప్రశ్నించిన వారిపై గంజాయి కేసు పెట్టడం దుర్మార్గం
- విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి
- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం డిమాండ్
- డీఈఓ కార్యాలయం ముట్టడి


డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు

ఒంగోలు సిటీ: పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలో వేలాది మంది విద్యార్థుల మార్కులు తప్పుగా రావడం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుణ్యమేనని, ఆ తప్పిదానికి బాధ్యత వహిస్తూ ఆయన తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడు దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఒంగోలు డీఈఓ కార్యాలయాన్ని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు శుక్రవారం ముట్టడించారు. డీఈఓ కిరణ్‌కుమార్‌కు పదో తరగతి పరీక్షల మూల్యాంకనానికి సంబంధించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుగ్గిరాల నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ మీద పెట్టి శ్రద్ధ విద్యారంగం మీద చూపించడం లేదని విమర్శించారు. కూటమి పాలనలో విద్యార్థుల భవిష్యత్‌ను గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పిదం వల్ల వేలాది మంది విద్యార్థుల భవిష్యత్ మీద తీవ్ర ప్రభావం చూపించిందన్నారు. ఏడాది పాటు కష్టపడి చదివి మంచిమార్కులు సాధించినా మూల్యాంకనంలో జరిగిన తప్పుల వల్ల ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలను కోల్పోయారని చెప్పారు. ట్రిపుల్‌ఐటీకి అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల సీటు రాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మూల్యాంకనం తప్పిదాల వలన ట్రిపుల్‌ఐటీ సీట్లు కోల్పోయిన వారికి ప్రత్యేకంగా అడ్మిషన్లు నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీతో పాటు గురుకుల జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు లభించక అన్యాయమైన విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఎలాంటి రుసుం లేకుండా ప్రతి విద్యార్థికి చెందిన జవాబు పత్రాలను సక్రమంగా రీవాల్యుయేషన్ చేయాలని, తుది ఫలితాలు విడుదల చేసేంత వరకు పదో తరగతి మార్కుల ఆధారంగా నిర్వహిస్తున్న వివిధ విద్యా సంస్థల అడ్మిషన్లను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. మూల్యాంకనంలో చేసిన తప్పులకు బాధ్యులైన ఉన్నతాధికారులపైన, విద్యామంత్రి లోకేష్ పైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ బాధ్యులైన అందరిపైనా చర్యలు చేపట్టాలని, దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించిన తమ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిపై గంజాయి కేసు పెట్టి జైల్లో పెట్టారని, ఇది అత్యంత దుర్మార్గమన్నారు. ఇటువంటి బెదిరింపులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం భయపడదని, పోరాటం ఇంకా ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ నారాయణ రెడ్డి, మహేంద్ర రెడ్డి, వేముల శ్రీకాంత్, ఖాదర్ బాషా, సాయి, దావీదు, విక్రమ్, వాసు, నాయకులు పాల్గొన్నారు.